క్లుప్తంగా

చిత్రకళా పోటీల్లో విజేతలకు 3న బహుమతులు

భీమవరం: భీమవరం పట్టణంలోని అంకాల ఆర్ట్ అకాడమీ ఈనెల 20వ తేదిన నిర్వహించిన చిత్రకళా పోటీల్లో విజేతలకు నవంబర్ 3వ తేదిన బహుమతులు అందజేయనున్నట్లు అకాడమీ కోశాధికారి గోపా సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఎం జాన్సీదేవి, పి వీరేంద్ర, ఎం యజ్ఞాంబిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలవగా జూనియర్స్ విభాగంలో కె అక్షర, వి వెంకటచందు, ఎ దేవిప్రియ, సబ్ జూనియర్స్ విభాగంలో జి కనిష్క, కె నాగసాయి, తంజీబా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్స్ అందజేస్తామని సత్యనారాయణ తెలిపారు.

మా భూములు మాకే ఉంచండి!

ఆకివీడు: సర్వే విధానం మాకు వద్దని గతంలో వలేనే మా భూములు మాకు ఉంచండి అంటూ పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో బుధవారం రీ సర్వేపై అవగాహనా కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నందమూరి ప్రకాశం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూదాల సూర్యనారాయణ, మంతెన మురళీకృష్ణంరాజు, కలిదిండి నగేష్ రాజు, వీఆర్వో దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

పాలకోడేరు: భీమవరం ఇన్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహిస్తారని ఆయన ఆయన చేసిన మిలటరీ ఆపరేషన్ వలన స్వాతంత్రం అనంతరం దేశంలో చాలా సంస్థానాలు కలిశాయని, ఆయన ఆలోచనలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని దేశానికి, వారి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ అన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కుర్రెళ్ల భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన నాగళ్లమూడి వెంకటేశ్వర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేటులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పనిచేస్తున్న నాగళ్లమూడి వెంకటేశ్వర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. నిబద్ధతతో పనిచేసిన వెంకటేశ్వర్లను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలిచారన్నారు. స్వచ్ఛందంగా వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంటు కె. సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ, ఆర్.ఎ డి.సోమరాజు, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశాలి, పి.వై.రత్నాకర్, తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లకు అభినందనలు తెలిపారు.

ముంపును తట్టుకుని అధిక దిగుబడి

- వరిలో సస్యరక్షణ చర్యలతో మంచి ఫలితాలు
- ఎంటీయూ 1318 ఘనత
- కుప్పనపూడిలో ఆదర్శ రైతు విజయం

ఆకివీడు: వరదలు, భారీ వర్షాలతో వరి చేలు అతలాకుతలమయ్యాయి. మండలంలోని కొల్లేరు తీర ప్రాంత గ్రామాల్లోని పంటతో పాటు, కుప్పనపూడి, అజ్జమూరు, అయిభీమవరం, చెరుకుమిల్లి తదితర గ్రామాల్లో పంట నీట మునిగి 90 శాతం పంట కుళ్లిపోయి కనుమరుగైంది. ఇదే సమయంలో మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు సాగు చేసిన ఎంటీయూ 1318 వంగడం నీట మునిగి కొంత మేర నష్టం వాటిల్లింది. వరి పూర్తిగా ఎండిపోయే దుస్థితికి చేరింది. ఈ పరిస్థితుల్లో ముంపునీరు బయటకు పంపి చేలల్లో పొటాష్ చల్లారు దీంతో పంట ఏపుగా ఎదగడమే కాకుండా మొక్క కుదుళ్లకు 50 నుంచి 63 పిలకలు వేసింది. చల్లారావు నాలుగెకరాల్లో పంట ఒకే స్థాయిలో ఉంది. మొక్క ఎదుగుదల, పిలకల శాతం సంతృప్తికరంగా ఉన్నాయి. వరి మొక్క మరింత మాను తిరిగేందుకు 20-20 ఎరువులను వాడారు. ఒకే స్థాయిలో 4 అడుగుల ఎత్తులో వరి పంట పొట్ట వేసుకునే దశలో ఉంది. కలుపు మందుల వాడకంతో కలుపు మొక్కల బెడద పోయింది.



ముంపు బెడదను తట్టుకొని ఎదిగిన వరి చేను



ముంపు నీరు బయటకు పోయిన తరువాత వరి దుబ్బుకు 63 కుదుళ్లు వేసిన దృశ్యం

మంచి ఫలితం ఇచ్చిన పచ్చిరొట్ట సాగు

గత దాళ్వా సాగు పూర్తయిన తరువాత తొలకరి వర్షాలు కురుస్తున్న సమయంలో చేలల్లో జీలుగ పచ్చిరొట్ట సాగు రైతు చేపట్టారు. జీలుగ మొక్క సంతృప్తికరంగా ఎదిగింది. జీలుగ మొక్కతోనే దమ్ము చేశారు. దమ్ముకు కృషి ట్రాక్టర్ వినియోగించడంతో మంచి ఫలితాలను ఇచ్చింది. ఏ విధమైన ఎరువులు వాడలేదు. జీలుగ పచ్చిరొట్ట దమ్ములో కలియడంతో చేలల్లో ఉన్న సెలనిటీ ప్రభావం తొలగింది. చౌడు భూములుగా ఉన్న ఈ ప్రాంతంలో పచ్చిరొట్ట సాగు ఎంతగానో ఉపయోగపడింది. చౌడు ప్రభావం లేకుండా వరి మొక్కలు ఏపుగా ఎదిగాయి.

అధిక దిగుబడి రావచ్చు



వరదలు, భారీ వర్షాలకు నాలుగెకరాల సాగు భూమి మునిగిపోయింది. ఊడ్పులూడ్చి నెల రోజులు గడవలేదు. నీట మునిగిన వరి మొక్కలు కుళ్లి ఎండిపోతున్నాయి. ఫలితం దక్కదని భావించాను. అయినప్పటికీ చేలను రక్షించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేశాను. వరదలు, వర్షాలు తగ్గడంతో నీటిని బయటకు తోడేశాను. చేలల్లో పొటాష్ చల్లాను. సాగుకు ముందే సస్యరక్షణ చర్యల్లో భాగంగా పచ్చిరొట్ట జీలుగ సాగు చేసి, దుమ్ములో కలియదున్నాను. దీని ఫలితంగా సాగు చేసిన ఎంటీయూ 1318 వంగడం మళ్లీ జీవం పోసుకుంది. మొక్క బతికి క్రమంగా 55 నుంచి 63 వరకూ పిలకలు వేశాయి. అధిక దిగుబడులను ఇస్తుందన్న నమ్మకం కలిగింది. చచ్చి బతికిన వరి చేను 60 బస్తాల నుంచి 65 బస్తాల దిగుబడి ఇస్తుందన్న ఆశాభావం కలుగుతుంది.

నంద్యాల చల్లారావు, ఆదర్శ రైతు, కుప్పనపూడి, ఆకివీడు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: మండలంలోని ఉణుదుర్రు గ్రామానికి చెందిన అద్దంకి నానీ(44) విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం పురుగు మందు తాగి నానీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని భీమవరం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు ఆస్పత్రి నుంచి సమాచారం వచ్చింది. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్యపై దాడిచేసిన భర్త అరెస్టు

పాలకోడేరు: అనుమానంతో భర్త దాడి చేసి భార్యను గాయపరిచాడు. ఈ ఘటన పాలకోడేరు మండలంలోని మోగళ్లు గ్రామంలో చోటు చేసుకుంది. అతని వయసు (62), భార్య వయస్సు (54) తనకు వృద్ధాప్యం వచ్చినా అనుమానం జబ్బు నరనరానా జీర్ణించుకున్నాడు. ఇంకేముంది చీటికీ మాటికీ భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మోగల్లుకు చెందిన చదలవాడ గంగరాజు మంగళవారం బయటి నుంచి వచ్చిన భార్య సుశీలపై పెద్ద పెద్ద కేకలు వేస్తూ, బూతులు తిడుతూ, ఎవరితో తిరిగి వస్తున్నావంటూ దుర్భాషలాడి ఇనుప రాడ్డుతో తలపై కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు పంపించామని నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు పాలకోడేరు ఎస్సై రవివర్మ తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

పాలకోడేరు: జిల్లా, మండల సమైక్యలు ప్రజోపయోగ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పాలకోడేరు మండల సమైక్య భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సమైక్య సమావేశానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా ఉండే మీరు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ బీమా పథకాలు, వివిధ వర్గాల ప్రజల ప్రగతికి తోడ్పడే కార్యక్రమాలను ఎల్లప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాల కలిగే పథకాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన ఉంటే కుటుంబ పెద్దను అనుకోని సంఘటనలో కోల్పోయినప్పుడు ఈ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు గొప్ప మేలు చేసిన వారవుతారన్నారు. పీఎంజేజేబీవై పథకానికి రూ.436, పీఎంజేఏవై రూ.20 బీమా పథకాల ద్వారా రూ.2 లక్షల ప్రయోజనాన్ని పొందొచ్చన్నారు. రబీ పంట కాలంలో ప్రకృతి వైపరీత్యాల వలన వరి పంట నష్టపోకుండా రూ.615 చెల్లించి పంటలో బీమా పథకంలో రైతులు, కౌలు రైతులు చేరేలా ప్రోత్సహించాలన్నారు. డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు పి.అరుణకుమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజరు ఏ.నాగేంద్ర ప్రసాదు, వయోజన విద్యాశాఖ డీడీ ప్రభాకరరావు, తహసీల్దారు ఎన్.భారతి విజయలక్ష్మి, ఎంపీడీవో వి.రెడ్డియ్య, ఏపీఎంలు, జిల్లా సమైక్య, మండల సమైక్య, గ్రామ సమైక్య ఓబీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పొదుపు భవిష్యత్‌కు మలుపు

భీమవరం: నేడు చేసిన పొదుపు భవిష్యత్‌కు మలుపుగా నిలుస్తుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మలజ్యోతి అన్నారు. బుధవారం జాతీయ పొదుపు దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు, మహిళలు ఎక్కువ శాతం పొదుపు విషయంలో జాగ్రత్తలు వహిస్తారని, జీవితానికి పొదుపు లేకుంటే అదుపు లేని ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు పొదుపు అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, నేదునూరి రాధ, శైలజ, కె పార్వతి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం యూనియన్ బ్యాంక్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పాలకోడేరు: గత వారం రోజుల నుంచి పాలకోడేరు మండలంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ గ్రామసభ మోగల్లు గ్రామంలో సర్పంచ్ మల్లిపూడి కృష్ణ కుమారి అధ్యక్షతన సచివాలయం వద్ద నిర్వహించారు. గ్రామసభకు హాజరైన మండల తహసీల్దార్ నడింపల్లి భారతీ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రెవెన్యూ భూ సంబంధిత సమస్యలకు ఈ రీసర్వే పరిష్కారం చూపుతుందని, దీనికి సంబంధించి ఈ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత వరకు రెవెన్యూ పరంగా ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.సూర్యనారాయణరాజు, ఆర్ఐ కె.రాఘవ మూర్తి రాజు, మండల సర్వేయర్ సీహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ సెక్రటరీ సుజాత, గ్రామ రెవెన్యూ అధికారులు పంపన సురేష్, ప్రసాద్, గ్రామ సర్వేయర్ ఎం.మనోజ్, లలిత, కూటమి నాయకులు కొత్తపల్లి వెంకట సత్య సూర్యనారాయణరాజు, సాంబ్రాణి సత్య శ్రీ సంకురుడు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపండి

- కమిషనర్‌పై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు
- సమస్యల్ని సాగదీస్తున్నారని ఆగ్రహం

ఆకివీడు: పట్టణంలోని పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా సమస్యల్ని సాగదీస్తున్నారని పలువురు అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కమిషనర్‌పై ధ్వజమెత్తారు. స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో బుధవారం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు నిమ్మల నాగు, తెదేపా కౌన్సిలర్లు కిమిడి అరుణ కుమారి, జనసేన కౌన్సిలర్లు గోపిశెట్టి సత్యవతి, బత్తుల శ్యామల, గుర్రాన నాగలక్ష్మి, బొల్లా వీర శ్వేత తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్‌లు నాచుపట్టి ఉన్నాయన్నారు. ఇసుక మార్పిడి జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పండుగ రోజుల్లో మురుగు నీరు సరఫరా చేస్తారా అని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. వీధి లైట్లు వెలగక పలు వార్డుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ వాటర్ వర్క్స్ పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా ట్యాంకుల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. వీధిలైట్ల కొనుగోలు చేస్తున్నామన్నారు. స్థానిక కొండయ్య చెరువు ప్రాంతంలో చెత్త వేయడాన్ని వైస్‌చైర్మన్ పండు, నాగు అభ్యంతరం తెలిపి, చెరువుల్ని పూడ్చవద్దని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయన్నారు. కుళాయి కనెక్షన్లు ఆన్‌లైన్ చేయడంలో ఆలస్యంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు పడాల శ్రీనివాసరెడ్డి, కట్టా రవి, కటికతల జాన్‌వెస్లీ, దొడ్డి జగదీష్, జిల్లా పెద్దిరాజు, అప్పారావు, మోటుపల్లి కుమారి, ఎండీ. అష్రఫ్ ఉన్నీసా, నేరెళ్ల ప్రసన్న, గుర్రాన నాగలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు ఎండీ. జక్కీ, గుండుగొలను సావిత్రి పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో సమస్యలపై మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ పుప్పాల పండు

2 నుంచి చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు

ఉండి: మండల కేంద్రమైన ఉండిలో పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ కార్తీక మాసోత్సవాలు జరగనున్నాయి. పరమేశ్వరుడికి 34 ద్రవ్యాలతో ప్రతీ రోజూ అభిషేకాలు నిర్వహించనున్నారు. 15వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయం వద్ద జ్వాలాతోరణం, 19వ తేదీన హోమాలు, 21న అమ్మవారికి కుంకుమ పూజ, సూర్య నమస్కారములు, రుద్ర చండీ హోమాలు, రాత్రి 7 గంటలకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పీఎంపీ నిర్లక్ష్యంపై ఫిర్యాదు

భీమవరం(ప్రకాశం చౌక్): పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. బాధితుడు కుమార్తె వీరవల్లి సాయిదుర్గా బుధవారం జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామానికి చెందిన పితాని రాజు ఈనెల 9న జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ పీఎంపీ వైద్యుడు కటికిరెడ్డి జగన్నాథరావు వద్దకు తీసుకువెళ్లారు. 14వ తేదీ వరకు రాజుకు జగన్నాథరావు వైద్యం చేశారు. అయినా నయం కాకపోవడంతో రాజు కుమార్తె సాయిదుర్గ తన తండ్రిని పెద్దాసుపత్రికి తీసుకువెళతానని చెప్పింది. అవసరం లేదని చెప్పి మరో వ్యక్తిని తీసుకువచ్చి రాజుకు ఇంటి వద్దే జగన్నాథరావు ఆపరేషన్ చేశాడు. ఇందుకు రూ.44 వేలు వసూలు చేశాడు. మూడు రోజులు గడిచిన తర్వాత రాజు ఆరోగ్యం క్షీణించడంతో కుమార్తె సాయిదుర్గా నరసాపురంలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ జాయిన్ చేసుకోవడానికి నిరాకరించడంతో ప్రస్తుతం పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. పీఎంపీ జగన్నాథరావు నిర్లక్ష్యంతో రాజు రెండు వరిబీజాలు దెబ్బతినడంతో డాక్టర్లు ఒకటి తొలగించారు. తన తండ్రికి జరిగిన అన్యాయంపై కుమార్తె సాయిదుర్గా మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేసింది. అలాగే బుధవారం డీఎంహెచ్‌వోకు కలిసి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి సదరు పీఎంపీపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు.



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న సాయిదుర్గ

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వై.నూకరాజు అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయిలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రైతులు సాగు చేపట్టే ముందు భూమిలో నవధాన్యాలను వేసుకోవాలన్నారు. నవధాన్యాలు మొక్క దశకు వచ్చిన తర్వాత భూమిలో దున్నడం ద్వారా సారవంతంగా తయారవుతుందన్నారు. తద్వారా కలుపు తగ్గుతుందని రైతులు సైతం పేర్కొంటున్నారన్నారు. నవధాన్యాల ద్వారా పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రకృతి సాగు ప్రయోజనాలను రైతులకు వివరించి, డివిజన్‌లో ఐదు వేల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఏడీఏ పీ.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత భాగంలో ప్రకృతి విధానంలో సాగు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారులు ఆర్ఎస్.ప్రసాద్, పార్థసారధి, ప్రసాద్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వై.నూకరాజు

రోడ్లు వేసి ప్రజలు ప్రాణాలు కాపాడండి

వీరవాసరం: మండలంలో నువుదూరు జంక్షన్ నుంచి మడుగు పోలవరం లంక వరకు ఆర్అండ్‌బి రోడ్డు వెడల్పు పెంచి వెంటనే వేసి ప్రమాదాలు లేకుండా చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. ఉత్తర పాలెం -కొణితవాడ గ్రామ సీపీఎం మహా సభ బుధవారం పాల అజయ్‌గోష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జండాను సీనియర్ సభ్యులు కడలి వీరన్న శెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలో రోడ్లు వేయాలని కోరారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. ఈ సభలో పాల కోటేశ్వరరావు, జుట్టిగ సాంబియాంబ, కిలాడీ సత్యనారాయణ జుత్తిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహా సభ అనంతరం కేతా జ్యోతిబసు తిరిగి శాఖ కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పని స్థలాలలో మహిళలకు భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ అన్నారు. పట్టణంలోని శేషమహల్ థియేటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాన వర ప్రసాద్ మాట్లాడుతూ కలకత్తా ఆర్జీకార్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్య, అయోధ్యలో పారిశుద్ధ్య కార్మికులపై జరిగిన సామూహిక అత్యాచారం, ఏపీలో అత్తా, కోడలిపై జరిగిన అత్యాచారం, పసి పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు తదితర సంఘటనలపై దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలు తాము పొందిన ఉద్యోగాలను, ఉపాధిని కాపాడుకోవాలంటే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు.